క్లుప్తంగా

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

దెందులూరు: దివ్యాంగ చిన్నారుల లోపాలను గుర్తించి మానవతా దృక్పథంతో ఉపాధ్యాయులు వారికి ప్రత్యేక శిక్షణనివ్వాలని హెచ్ఎంఎస్ జి శర్మ గ్రంథ పాలకులు గుల్లపూడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో భవిత దివ్యాంగుల పాఠశాలలో డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ డి సుధీర్ కుమార్, భవిత పాఠశాల సిబ్బంది డి హేమలత, శ్రీదేవి, చిన్నారులకు సూచనలు సలహాలు ఇచ్చారు.

విద్యార్థుల పారిశ్రామిక సందర్శన



పారిశ్రామిక సందర్శనకు వెళుతున్న కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం, విద్యార్థులు

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులు బుధవారం పారిశ్రామిక సందర్శన చేశారు. ఈ సందర్శనలో భాగంగా కొవ్వలిలో సత్యదేవ రైస్‌మిల్లు, సువేరా రైస్‌మిల్లును వారు సందర్శించారు. వరి పొలాలను వారు పరిశీలించారు. పంటల సాగు విధానం అనంతరం రైసు మిల్లులో బియ్యం, ఊక తదితర ఉత్పత్తి, మార్కెట్‌పై ట్రైనర్స్ సునీల్, రజాక్ వివరించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



క్రొవ్విడిలో సీసీ రహదారికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే ధర్మరాజు, ఎంపీపీ ఆదిలక్ష్మిలు

నిడమర్రు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.2.72 కోట్లతో 8 సీసీ రహదారుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శంకుస్థాపన చేశారు. బుధవారం మండలంలోని క్రొవ్విడి, బావాయిపాలెం, సిద్ధాపురం, ఎనికేపల్లి, ఆడవికొలను, బువ్వనపల్లి, నిడమర్రులో పల్లె పండుగ గ్రామ సభల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో గ్రామలు అభివృద్ధికి పంచాయతీ స్థాయిలోనే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, ఎంపీడీవో విజయకుమారి, నాయకులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు సత్కారం



బదిలీ అయిన కార్యదర్శులను సత్కరిస్తున్న సిబ్బంది

దెందులూరు: ప్రతి ఉద్యోగికి బదిలీ, పదోన్నతి, ఉద్యోగ విరమణ సర్వసాధారణమని దెందులూరు ఎంపీడీవో కే శ్రీదేవి అన్నారు. బుధవారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో దెందులూరు మండలం గ్రామ కార్యదర్శులు సంఘం అధ్యక్షుడు జీటీ ఆనంద్ కుమార్ అధ్యక్షతన దెందులూరు మండలంలో కార్యదర్శులుగా పనిచేసి బదిలీపై వెళుతున్న వీఎస్ చౌదరి, ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, రంగనాయకమ్మ, టైపిస్ట్ నాగలక్ష్మి ఎంపీడీవో శ్రీదేవి గ్రామ కార్యదర్శి ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఆదిలక్ష్మి, షరీఫ్ తదితరులు ఉన్నారు.

జీజీహెచ్‌లో తనిఖీలు

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్ల కేటాయింపుకు సంబంధించి ఏలూరు జీజీహెచ్‌లో సౌకర్యాలను పరిశీలించేందుకు ఈ బృందం బుధవారం ఏలూరులో పర్యటించింది. గుంటూరు మెడికల్ కళాశాల జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణి, విజయవాడ మెడికల్ కళాశాల గైనకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్యతో కూడిన ప్రత్యేక బృందం ఏలూరు జీజీహెచ్‌లో ఆయా విభాగాలను పరిశీలించింది. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఎనస్థీషియా, పిడీయాట్రిక్, ఆర్థో, సర్జికల్ విభాగంలో ఒక్కో పీజీ సీటు కేటాయించేందుకు ఈ పరిశీలన చేస్తున్నట్టు వారు తెలిపారు. ఆసుపత్రిలో పరిస్థితులను ఏలూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు, డాక్టర్ సికిందర్ మోహన్, డాక్టర్ హేమా చౌదరి తదితరులు బృందానికి వివరించారు.

మందుల్లేవ్..

- నెల రోజులుగా దెందులూరు సీహెచ్‌సీకి మందుల సరఫరా నిలుపుదల
- ఆస్పత్రిలో 33 రకాల మందులు, ఇంజెక్షన్ల కొరత
- వైద్య సిబ్బంది, ఆధునిక పరికరాలున్నా నిరుపయోగం
- నిరాశతో వెనుతిరుగుతున్న రోగులు



దెందులూరు సీహెచ్‌సీ



ఆస్పత్రిలోని రోగులు

దెందులూరు: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న దెందులూరు సీహెచ్‌సీలో నెల రోజులుగా 33 రకాల మందులు, ఇంజెక్షన్ల కొరత నెలకొంది. ఈ ఆస్పత్రికి నెల రోజులుగా మందులు, ఇంజెక్షన్లు, సూదులు, ఐవీ క్యాన్స్, గ్లౌజ్‌లు, కాటన్ సరఫరా నిలిచిపోయింది. దెందులూరు సీహెచ్‌సీలో ఏడుగురు వైద్యులు, స్టాఫ్ నర్సులు అంకిత భావంతో సేవలందిస్తున్నారు. ఓపీ సైతం ప్రతిరోజూ వంద మందకి పైగా రోగులు దెందులూరు నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఈ ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో మందులు, ఇంజెక్షన్లు, వైద్యపరికరాలు, అధునాత భవనం ఏర్పాటు చేశారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకాలంలో కదల లేని స్థితిలో మంచంపై ఉండి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సైతం వైద్య సిబ్బందిని ఇంటికి పంపించి వైద్యసేవలందించేలా చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రులకు నిధుల కేటాయింపు తగ్గింది. జిల్లా అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు దెందులూరు సీహెచ్‌సీని పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దెందులూరు సీహెచ్‌సీకి నాలుగు ప్రాంతాల నుంచి అనేక మంది రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారు. మందులు, ఇంజెక్షన్లు అందుబాటులో లేకపోవడంతో రోగులు నిరాశతో మరింత ఆవేదనతో వెనుతిరిగి వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక అందించాం

నెల రోజుల నుంచి సీహెచ్‌సీలో 33 రకాల మందులు, ఇంజెక్షన్లు, సూదులు, ఐవీ క్యాన్స్, కాటన్ సరఫరా కావడం లేదని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సుందర్ తెలిపారు. ఈ విషయాన్ని నివేదికతో ఉన్నతాధికారులకు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు లిఖితపూర్వకంగా అందించానని సూపరింటెండెంట్ వివరించారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: కైకరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన యోగా పోటీల్లో ప్రతిభ చూపారు. ఈ నెల 15 మంగళవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో పాఠశాలకు చెందిన పాతినించి నాగరాజు, ఉప్పాడ రేవంత్ వసంత్‌కుమార్ పాల్గొని ప్రతిభ చూపారు. నవంబరులో నెల్లూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వారు ఎంపిక అయ్యారని హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎన్నికై న విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయమ ఉపాధ్యాయులు ఎ.నాగసుధ, ఈ.పాపయమ్మను ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

వర్షాలతో రైతన్నల ఆందోళన

- పొట్ట, ఈనిక దశలో వరి పైరు
- 9 రోజులపాటు వర్షాలు కురిస్తే పంటలకు తీవ్రనష్టం



వరి పైరు

దెందులూరు: మూడు తుఫాన్లు ఏర్పడనున్నాయని, వాటి కారణంగా 9రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతన్నలు తీవ్ర కలతచెందుతున్నారు. అన్ని గ్రామాల్లో రైతులు వరి సాగుచేశారు. ప్రస్తుతం పొట్ట, ఈనిక దశలో వరి పైరు ఉంది. ఈ దశకు ఎకరానికి రూ.25 నుంచి రూ.28 వేల వరకు రైతన్న పెట్టుబడి పెట్టారు. ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల ముందు అది చేస్తాం, ఇది చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారు. ఒకవైపు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి మొండి చెయ్యి చూపడంతో అప్పులు తెచ్చి రైతులు సాగుకు పెట్టుబడి పెట్టారు. దెందులూరు మండలంలో 17,846 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. గోరు చుట్టుపై రోకలి పోటు అన్న చందంగా అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతుల ఆశలపై తుఫాన్లు, భారీ వర్షాలు నీళ్లు చల్లుతున్నాయి. వరి పైరు ఈనిక, కంకుల దశలో ఉన్న ఈ సమయంలో మూడు తుఫాన్ల కారణంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిస్తే తీవ్రనష్టం వాటిల్లుతుందని రైతులు దిగులు చెందుతున్నారు. సోమ, మంగళవారం కురిసిన వర్షానికి రైతన్న తీవ్ర కలత చెందుతున్నాడు. వ్యవసాయశాఖ అధికారులు ఈ స్థాయిలోనే వర్షం రెండు మూడు రోజులు కొనసాగితే వరితోపాటు అన్ని రకాల పంటలకు నష్టం వాటిల్లుతుందని అంటున్నారు.

గ్రామ సభల్లో రైతుల సమస్యలు పరిష్కారం

ఉంగుటూరు: త్వరలో నిర్వహించనున్న రీసర్వే గ్రామ సభల్లో రైతుల సమస్యలు పరిష్కరిస్తామని ఉంగుటూరు ఇన్‌చార్జి తహసీల్దారు పూర్ణచంద్ర ప్రసాదు తెలిపారు. ఈనెల 18న వెల్లమిల్లిలో, 19న బొమ్మిడి, 22న కాగుపాడు, 23న రావులపర్రులో, 24 రాచూరులో, 25న దొంతవరంలో గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలు, భూముల విభజన, వారసత్వ పేర్ల నమోదు, ఇతర సమస్యలు, రీ సర్వేల నిర్వహించిన గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రికార్డుల్లో మార్పుల కోసం ఈ సభలు దోహదపడతాయని తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు తెలిపారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా, రైతులు

దెందులూరు: రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడం, భూసార పరీక్షల ఆధారంగా ఎరువు యాజమాన్య పద్ధతి పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. బుధవారం గోపన్నపాలెంలో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వై.సుబ్బారావు, దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి దామా వెంకటేశ్వర్లు, రైతులతో కలిసి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఆర్ఎస్‌కే ఇన్‌ఛార్జులు, కస్టోడియన్ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, హెల్పర్లు వారి విధులు సక్రమంగా పాటించి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

ముగిసిన సీపీబీ వర్క్‌షాపు

ఏలూరు (టూటౌన్): సెయింట్ థెరిస్సా అటానమస్ కాలేజీలో ఈ నెల 15, 16 తేదీల్లో ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, విజయవాడకు చెందిన మైక్రోలింక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సీపీబీ వర్క్‌షాపు బుధవారం ముగిసింది. 15వ తేదీన మూడో సెషన్లో విద్యార్థులు కంప్యూటర్ ల్యాబ్‌లో పీసీపీ విజార్డ్ 3.1.5ని ఉపయోగించి విద్యుత్ సరఫరా, టెస్టర్, నైట్ లాంప్ సర్క్యూట్‌లను రూపొందించారు. రెండు రోజుల వర్క్‌షాపులో విద్యార్థులు సర్క్యూట్ డిజైనింగ్‌పై శిక్షణ పొందారు. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్‌లో ఇచ్చింగ్, సర్క్యూట్లను కనెక్ట్ చేయడంలో నైపుణ్యాలను నేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఎ.నిర్మల జ్యోత్స్న మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీయడమే కాకుండా భవిష్యత్తులో స్వయంగా నూతన ఆవిష్కరణల రూపకల్పనకు తగిన శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. వర్క్‌షాపుకు విచ్చేసిన రిసోర్స్ పర్సన్స్ సాంబశివ రావు, గోవిందరావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.శ్రీలత, అనూష, సరస్వతి, దీప్తి భార్గవి, మాధురి రోజ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు



భీమడోలు గ్రామోత్సవంలో నరెడ్లగూడెంలోని గడ్డెపై వేంచేసియున్న అమ్మవారు



నరెడ్లగూడెంలోని విశేష అలంకరణలతో ముస్తాబైన అమ్మవారు

భీమడోలు: గుండుగొలను, నరెడ్లగూడెంలో బుధవారం దసరా ఉత్సవమూర్తి, భక్తుల పూజలందుకున్న కనకదుర్గమ్మ విగ్రహాలకు వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భీమడోలు పంచాయతీ శివారు నరెడ్లగూడెంలో గడ్డెపై కొలువైన కనకదుర్గమ్మ విగ్రహ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఊరేగించారు. నరెడ్లగూడెం వద్ద ప్రారంభమైన ఊరేగింపు వడ్లపట్ల మీదుగా భీమడోలుకు చేరుకుంది. గ్రామాల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాల్చుతూ అమ్మవారిని ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు చేశారు. గుండుగొలనులో అమ్మవారి విగ్రహాలను ఊరేగించారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు సిద్ధం



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాశాఖాధికారులు

ఉంగుటూరు: నీలాద్రిపురం, నారాయణపురం, చేబ్రోలులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్ర సందర్శనలో భాగంగా ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంలో తూటి కాడ కషాయం తయారీ విధానం, వినియోగం, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయం దగ్గర వ్యవసాయ అనుబంధ శాఖల సంబంధించిన అధికారులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు నచ్చిన మిల్లుకు ధాన్యం తరలించే విధంగా ప్రభుత్వం రైతులకు ఈ ఖరీఫ్ 2024 నుంచి అవకాశం కల్పిస్తోందని ఏవో తెలిపారు. పశువులకు టీకాలు, మినీ గోకులం షెడ్లకు సంబంధించి దరఖాస్తులను ఇప్పటికే స్వీకరిస్తున్నామని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ రైతులకు తెలిపారు. ఉద్యానవన, విద్యుత్ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా రైతులకు అందించే సేవలు, స్కీములను వివరించారు. సర్పంచ్‌లు నీలాద్రిపురం, నారాయణపురం, చేబ్రోలు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, శరణాల మాలతి రాణి, నాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆహార అవసరాన్ని గుర్తెరగాలి



దెందులూరు నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

దెందులూరు: ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి ఆహారం దొరకడంలేదని వారిలో 14 కోట్ల మందిలో పోషకాహార లోపం, ఎదుగుదల లోపం ఉందని, ప్రస్తుత రోజుల్లో ప్రజలు సంప్రదాయ ఆహారం కంటే ఫాస్ట్‌ఫుడ్స్‌కు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి సూకరాజు అన్నారు. ప్రపంచ ఎనస్థీషియా దినోత్సవాన్ని విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా సూకరాజు మాట్లాడుతూ బుధవారం దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆహార పదార్థాలను నర్సింగ్ విద్యార్థులు సిద్ధం చేసి ప్రదర్శించారని అన్నారు. అందరూ ఆహారం అవసరాన్ని గుర్తించాలని అన్నారు. ఎనస్థీషియా ద్వారా రోగికి ఏ చిన్న నొప్పి లేకుండా శస్త్ర చికిత్సలు సులువుగా చేస్తున్నారని అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో వైద్యసేవల్లో విప్లవాత్మకమార్పులు వచ్చాయన్నారు.

చిననింద్రకొలను స్కూల్లో సందడి



నిడమర్రు: చిననింద్రకొలనులో విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన

నిడమర్రు: ఆకలి, పోషకహార లోపం,ఆహార భద్రతపై అవగాహన కల్పించేందుకే ఏటా అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహిస్తామని చిననింద్రకొలను చింతలపాటి మూర్తిరాజు జెడ్పీ స్కూల్ హెచ్ఏ పీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం చిననింద్రకొలను హైస్కూల్లో ప్రపంచ ఆహార దినోత్సవం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల తయారీపై పోటీ నిర్వహించి గ్రామ పెద్ద కొండయ్య ఆర్థిక సహకారంతో విజేతలైన హవీల, మహాలక్ష్మి, అభిరామ్, అనూహ్య, భవ్యసరి, తేరేజమ్మకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18 నుంచి రీ సర్వేపై రెవెన్యూ గ్రామ సభలు



తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో మాట్లాడుతున్న ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్

దెందులూరు: వీఆర్ఓలంతా ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న రీ సర్వేపై రెవెన్యూ గ్రామ సభలకు సిద్ధం కావాలని దెందులూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సభలు ముగిసే వరకు డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ సర్వేయర్లు అంకితభావంతో పనిచేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అనంతరం రైతులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తూకం, ఆన్‌లైన్‌లో నమోదు, శాంపిల్స్ సేకరణ, ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని అంశాలపై రైతులకు జవాబుదారీగా ఉండాలన్నారు. రీసర్వే, గ్రామ సభలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ అమలులో రెవెన్యూ ఉద్యోగులు ఎటువంటి అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలన్నారు. ప్రతిరోజూ ఈ రెండు కార్యక్రమాలను మండల, డివిజన్ అధికారులు పర్యవేక్షణ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుమతి, డిప్యూటీ తహసీల్దార్లు ప్రియదర్శిని, కృష్ణస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్ఓల సంఘం దెందులూరు మండల అధ్యక్షుడు కిషోర్ అన్ని గ్రామాల వీఆర్ఓలు ఉన్నారు.

నేటి నుంచి మహిళలకు మగ్గం వర్క్‌పై శిక్షణ

భీమడోలు: భీమడోలు శ్రీసత్యసాయి సేవా సంస్థల మండల శాఖ ఆధ్వర్యంలో భీమడోలు అమ్మవార్ల ఆలయాల ప్రాంగణంలో గురువారం ఉదయం 11 గంటలకు మహిళ, యువతకు 37 రోజుల పాటు మగ్గం, జర్దోసి వర్క్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తామని కన్వీనర్ వర్దనీడి సత్యసాయి బుధవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ ఆర్థిక సహకారంతో భీమడోలులోని 100 మంది మహిళ, యువతకు శిక్షణ అందిస్తారని, భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి బ్యాంకు అధికారులు హాజరవుతారని ఆయన తెలిపారు.

శ్రీశ్రీ కళావేదిక కార్యక్రమ పోస్టర్ విడుదల

ఏలూరు (టూటౌన్): శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీల్లో తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో నిర్వహించే 140వ ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతర కార్యక్రమ పోస్టర్‌ను ఎమ్మెల్యే బడేటి చంటి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశా రు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరికోటి మాట్లాడుతూ సాహిత్యకారులు, కళాకారులు, కళాభిమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భారీ వర్షాలు.. రహదారులకు తూట్లు



భీమడోలు జంక్షన్ రోడ్డుపై వర్షపు నీరు



ఎంఎంపురం నుంచి సాయన్నపాలెం రోడ్డు దుస్థితి

భీమడోలు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు భయపడిపోతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం పొంచిఉంటుందోనన్న భయం వారిని వెంటాడుతోంది. భారీ వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గోతులను పూడ్చకపోవడంతో కూటమి ప్రభుత్వం పాలనను ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. నీటితో నిండిన గోతుల్లో పడి ద్విచక్ర వాహనదారులు క్షతగాత్రులవుతున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు, రాజుల వీధి, ఎంఎంపురం నుంచి సాయన్నపాలెం, సూరప్పగూడెం నుంచి పాతూరు రోడ్డు, భీమడోలు నుంచి పెదలింగంపాడు, కొల్లేరు గ్రామాల్లోని రోడ్లు అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్అండ్‌బీ శాఖకు నిధులు మంజూరైనా భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు గోతులను పూడ్చిన పాపాన పోలేదు. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో వాహనదారులు, ప్రయాణికులు, భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఎంఎంపురం నుంచి సాయన్నపాలెం వరకు ఆరు కిలోమీటర్ల ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఆ రోడ్డులో వర్షం కురిస్తే మోటార్ బైక్‌లు, సైకిళ్లు అదుపు తప్పి పక్కనే పంట బోదె, పొలాల్లో వెళ్లాల్సిందే. ఈ రోడ్డుపై ప్రయాణం నరకానికి ఆనవాళ్లుగా మారింది. ఇకనైనా సంబంధిత అధికారులు గోతులను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.